క్లుప్తంగా

ఉచిత కంటి పరీక్షలు



నెల్లూరు సిటీ: ప్రపంచ దృశ్య దినోత్సవం సందర్భంగా పొగతోటలోని శరణ్స్ జనరల్ దయాబెటిక్ డెంటల్ అండ్ ఐ కేర్ క్లినిక్‌లో గురువారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యనిపుణుడు విశ్వశరణ్‌రెడ్డి కంటి సమస్యలతో వచ్చిన వారికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కంటి సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

కీళ్ల సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి



నెల్లూరు సిటీ: కీళ్ల సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని మెడికవర్ ఆస్పత్రి సీనియర్ ఆర్థోపెడిక్ అండ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ కే శశిధర్‌రెడ్డి సూచించారు. ప్రపంచ ఆర్థరైటీస్ డే సందర్భంగా మెడికవర్ ఆస్పత్రిలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారని, ఆదిలోనే గుర్తించి తగిన వైద్యం చేయించుకోకపోతే వైకల్యం రావచ్చన్నారు. జీవనశైలిలో మార్పులు చేసుకుని వ్యాయామం చేస్తూ ఆహార నియమాలను పాటించడం, యోగా, తగిన నిద్రతో ఆర్థరైటీస్‌ను నియంత్రించవచ్చన్నారు.

అపోలోలో మోకాళ్ల స్క్రీనింగ్ పరీక్షలు



నెల్లూరు సిటీ: ప్రపంచ ఆర్థరైటీస్ డే సందర్భంగా అపోలో ఆస్పత్రిలో రూ.5 వేల విలువైన మోకాళ్ల స్క్రీనింగ్ పరీక్షలను రూ.999కే అందుబాటులోకి తెచ్చినట్లు ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీరాం సతీష్, ఆర్థోపెడిక్ సర్జన్ వివేకానందరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని అపోలో ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ ఆస్పత్రిలో మోకాళ్ల సమస్యలకు అత్యాధునిక వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. ఏడు రకాల మోకాలి సమస్యలకు సంబంధించిన పరీక్షలను ప్రత్యేక ప్యాకేజీగా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు ప్యాకేజీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. మోకాళ్ల నొప్పులతో బాధపడే రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు ఎం శశిధర్, చరణ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల నిరసన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో నగరంలో గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఏసీ సెంటర్ వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు యానాదయ్య, సిరాజ్, శరవణన్, కొండమ్మ, హఫీజ్, సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'లో ఆర్థరైటీస్‌పై అవగాహన



నెల్లూరు సిటీ: ప్రపంచ ఆర్థరైటీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఆర్థరైటీస్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ డాక్టర్ జాకీర్ హుస్సేన్ అర్షద్ మాట్లాడుతూ కీళ్ల సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. జీవనశైలిలో మార్పుల కారణంగా కీళ్ల వ్యాధులు అన్ని రకాల వయసుల వారిని తీవ్రంగా వేధిస్తున్నాయని పేర్కొన్నారు. ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి బిజర వీంద్రన్ మాట్లాడుతూ ఆర్థరైటీస్‌ను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించకపోతే కీళ్ల దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో నారాయణ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ సుప్రజ, వైద్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు డీకేడబ్ల్యూలో జాబ్‌మేళా

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాకు ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు, ఐటీఐ డిప్లొమో పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. వివరాలకు 87908 13132 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విజయమే లక్ష్యంగా..



మాట్లాడుతున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ఎంపీ విజయసాయిరెడ్డిని సత్కరిస్తున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి హాజరై రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. మేయర్ స్రవంతి పాల్గొన్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





ఎంపీ విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గౌరి, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు మొబీనా, నూనె మల్లికార్జునయాదవ్

బాలల హక్కుల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి పిలుపునిచ్చారు. నగరంలోని మహిళా ప్రాంగణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భేటీ బచావో..భేటీ పడోవాపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలల విద్య, ఆరోగ్యం, శ్రేయస్సు కోసం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పనిచేస్తుందన్నారు. 14 ఏళ్లలోపు బాలలకు విద్యను అందించేందుకు బాలల నిర్బంధ ప్రాథమిక విద్య హక్కు చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. సచివాలయ వ్యవస్థ సహకారంతో ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు బడిబయట ఉన్న బాలలను గుర్తించి వెంటనే ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లి బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి బాలల గుర్తింపును స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. డ్రగ్స్ బారిన పడిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చేందుకు ప్రత్యేకంగా పునరావాస కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిల్లలు సైబర్ నేరాల బారిన పడకుండా, సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా ప్రత్యేక కార్యక్రమాన్ని నవంబరులో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ పీడీ హేనాసుజన, డీఈఓ గంగాభవాని, జిల్లా వైద్యాధికారి పెంచలయ్య, ఆర్‌ఐఓ శ్రీనివాసులు, ఐటీడీఏ పీఓ రాణి, డీఎల్‌సీ వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ఏ పీఓ ఉషారాణి, సోషల్‌వెల్ఫేర్ డీడీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు రూరల్: నెలూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 15 నుంచి జరుగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి గురువారం రాత్రి ఆవిష్కరించారు. నగరంలోని ఎంపీ ఆదాల నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, ఈఓ మల్లికార్జున్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

వైభవంగా గంధ మహోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని 43వ డివిజన్ పెద్దబజారు దాడివారివీధిలోని హజరత్ కంతర్ష ఔలియా దర్గాలో 654వ గంధ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ గంధ మహోత్సవం పాల్గొని ప్రత్యేక దువా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంతర్ష ఔలియా దర్గా గంధ మహోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. భగవంతుని ఆశీస్సులతో అందరూ బాగుండాలని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, నగర ప్రజలకు మంచి జరగాలని ప్రార్థించామని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్ షేక్ కరీముల్లా, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మీరామొహిద్దీన్, వైఎస్సాఆర్‌సీపీ నాయకులు అతహర్‌బాషా, బాబా తదితరులు పాల్గొన్నారు.



దువా చేస్తున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

సోషల్ ఫారెస్ట్ ఇన్‌చార్జి డీఎఫ్‌ఓగా చంద్రశేఖర్

నెల్లూరు(బారకాసు): జిల్లా అటవీ శాఖాధికారి చంద్రశేఖర్‌కు నెల్లూరు రేంజ్ సామాజిక వన విభాగం (సోషల్ ఫారెస్ట్) ఇన్‌చార్జి డీఎఫ్‌ఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పొదలకూరురోడ్డులోని సోషల్ ఫారెస్ట్ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఎఫ్‌ఓగా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌ఓగా ఉన్న శ్రీనివాసులు ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌ఓ శ్రీనివాసులు ఇన్‌చార్జి డీఎఫ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పూర్వ డీఎఫ్‌ఓ శ్రీనివాసులు

వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్లు సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్‌భవన్‌లో గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల్లో ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లను నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా వినియోగదారులు విన్నవించిన విద్యుత్ తీగల మరమ్మతులు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు కాలపరిమితి, విద్యుత్ లోఓల్టేజీ, విద్యుత్ మీటర్, విద్యుత్ బిల్లుల్లో లోపాలు, తదితర సమస్యలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరిస్తున్నామని వివరించారు. కాగా నెల్లూరులో నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు 8 ఫిర్యాదులు అందగా, వాటిలో ఏడు ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించారు. ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి కార్పొరేట్ కార్యాలయానికి చెందిన ఆర్థిక సభ్యుడు రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యురాలు ఈశ్వరమ్మ, నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి, డీఈఈలు మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస ఆంజనేయమూర్తి

ప్రభుత్వ భవన నిర్మాణాలను పూర్తి చేయాలి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో చేపడుతున్న ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం ఆయన అమరావతి నుంచి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూముల రీ సర్వే, జాతీయ రహదారులు, మార్క్‌ఫెడ్ గోదాములకు భూసేకరణ, పీఎం కిసాన్, ఈ క్రాప్ నమోదు, సీసీఆర్‌సీ కార్డుల జారీ, కౌలు రైతులకు రుణాల మంజూరు, డెయిరీ డెవలప్‌మెంట్, జగనన్నకు చెబుదాం, తదితర అంశాలపై సమీక్షించి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ కూర్మనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనాలను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వేకు సంబంధించి స్టోన్ ప్లాంటేషన్, భూహక్కు పత్రాల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందేలా చూడాలన్నారు. జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా అమూల్ సంస్థకు పాలు పోస్తున్న రైతులకు విరివిగా రుణాలు అందజేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ చిరంజీవి, డ్వామా పీడీ వెంకట్రావు, పశుసంవర్ధక శాఖ జేడీ కోటేశ్వరరావు, డీపీఓ సుస్మిత, జిల్లా సహకార శాఖాధికారి సుధాభారతి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్ ప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఇన్‌చార్జి కలెక్టర్ రోణంకి కూర్మనాథ్

ప్రణాళికాబద్ధంగా ఆరోగ్య సురక్ష అమలు

- కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ప్రజలకు మెరుగైన వైద్యసేవలను మరింత చేరువగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వార్డు సచివాలయాల పరిధిలో ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని కమిషనర్ వికాస్‌మర్మత్ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. నగర పాలక సంస్థ పరిధిలోని అల్లీపురం, ఎన్టీఆర్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వైద్యసిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో గురువారం కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా అల్లీపురం, ఎన్టీఆర్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో శుక్రవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వైద్యసేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు, సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. శిబిరాలకు వచ్చే వారికి వైద్య పరీక్షలు, వైద్యసేవలు, ఉచితంగా మందులు అందజేయాలని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శర్మద, ఎంహెచ్ఓ వెంకటరమణ, డాక్టర్ జిజియాబాయి, టీపీఆర్వో ప్రసాద్, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను ప్రారంభానికి సిద్ధం చేయాలి

నగర పాలక సంస్థ పరిధిలో కేటాయించడిన ఏపీ టిడ్కో(జీ+3) గృహ నిర్మాణాల పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. వెంకటేశ్వరపురం, అల్లీపురంలోని టిడ్కో గృహాలను హౌసింగ్ అధికారులతో కలిసి గురువారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టిడ్కో గృహాలను అన్ని రకాల మౌలిక వసతులతో లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్పొరేషన్ ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, చంద్రయ్య, టిడ్కో ఈఈ శాస్త్రి, ఏపీఎస్పీడీసీఎల్ డీఈ, హౌసింగ్ అధికారులు, సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలి

నగరంలో పారిశుద్ధ్య పనులను పక్కాగా చేపట్టాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులకు సూచించారు. నగరంలోని అన్నమయ్య కూడలి నుంచి గొలగమూడి రోడ్డులోని వీపీఆర్ కల్యాణ మండపం వరకు గురువారం ఉదయం ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికంగా జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. రోడ్ల వెంబడి చెత్తను పడేస్తున్నట్లు గుర్తించి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఎంహెచ్ఓ వెంకటరమణ, శానిటరీ సూపర్‌వైజర్లు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.



ఎన్టీఆర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో సమీక్షిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్



వెంకటేశ్వరపురంలోని టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

మర్యాద పూర్వకంగా..




రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలపై చర్చించారు. – నెల్లూరు(దర్గామిట్ట)

జేసీని కలిసిన బాలల హక్కుల కమిషన్ సభ్యులు



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ రోణంకి కూర్మనాథ్‌ను ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఆమె వెంట ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ ఉన్నారు.

రేపట్నుంచి వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

నెల్లూరు రూరల్: కొత్తూరు పరిధిలోని శ్రామికనగర్‌లోని భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో ఈ నెల 14 నుంచి మూడ్రోజుల పాటు ఆరాధనోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. 14న గణపతి హోమం, గణపతి పూజ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అశ్వత్థనారాయణ కల్యాణం, అన్నదానం, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 15న సుదర్శన హోమం, అన్నదానం, విశేషాభిషేకాలు, పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 16న ఐరావతంపై వెంకయ్యస్వామి నగరోత్సవం నిర్వహించనున్నారు. కాగా మందిరం ధర్మకర్త మొలతాటి నీరదమ్మ పర్యవేక్షణలో ఆరాధనోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయ భూముల కౌలువేలం



నెల్లూరు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆలయ భూముల కౌలు వేలంపాటను గురువారం నిర్వహించారు. ములుముడిలోని సర్వే నంబర్ 753లోని మూడెకరాల భూమికి కౌలు వేలం నిర్వహించగా ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేశారు. అలాగే గోశాలలో ఎరువును వేలం వేశారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలో సర్టిఫికెట్ల పంపిణీ



నెల్లూరు (టౌన్): కౌశల్ దీక్షత్ సమారోహ కార్యక్రమంలో భాగంగా వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లను గురువారం పంపిణీ చేశారు. ఐటీఐలోని పదకొండు ట్రేడ్‌ల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు భార్గవి ఆటోమొబైల్స్ అధినేత కొండా నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మిగిలిన వారికి ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి చెంగల్‌రాయన్, ఖాజారహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ నంబర్లాట నిర్వాహకుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని టెక్కేమిట్ట, సారాయంగడి సెంటర్ (ప్రగతినగర్)లో సింగిల్ నంబర్లాటపై దర్గామిట్ట పోలీసులు గురువారం దాడులు చేశారు. సింగిల్ నంబర్లాట నిర్వాహకులను అరెస్ట్ చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. టెక్కేమిట్టలో ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1700 స్వాధీనం చేసుకున్నారు. సారాయంగడిసెంటర్‌లో నలుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 980 స్వాధీనం చేసుకున్నారు.

జనరల్ నోటీసు

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులు " Sri Venkata Akhil Rice Industry " a partnership Firm, Represented by its partners **1.మాదా అశోక్ తండ్రి మాదా గోవిందు 2. మాదా కుమారి భర్త అశోక్,** Residents of Flat No.104, Sree Chakra Heights Apartment, Prasanthi Nagar, Mypadu Road, Nellore City అను వారలకు హక్కు అనుభవము కలిగి ఉన్నదని చెప్పుచూ, నా కక్షిదారునికి అమ్మచూపినారు. ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తుల మీద Punjab National Bank వారికి ఉన్న తనఖా తప్ప ఇతర ఆదుమానములు, అన్యాక్రాంతములు లేవని చెప్పుచున్నారు. ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులపై ఎవ్వరికైనా ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 7 రోజుల లోపల నాకు వ్రాతమూలకముగా తెలియపరచవలసినది. లేనిచో ఎలాంటి ఆక్షేపణలు లేవని భావించి, నా కక్షిదారుడు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులను కొనుగోలు చేయగలరు.

ఆస్తి షెడ్యూలు

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా రిజిస్ట్రేషన్ - స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రేషన్‌లో చేరిన, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని నెల్లూరు బిట్-2, సర్వే నెం.354రు లోని

1వ అయిటం:- విస్తీర్ణం **231.50** అంకణములు స్థలమునకు హద్దులు :- తూర్పు : మాదా అశోక్ తాలూకు ఆస్తి, దక్షిణం : శ్రీ చక్ర హైట్స్ అపార్ట్‌మెంటు, పడమర : రోడ్డు, ఉత్తరం : ఆర్.వి.ఎస్ రైస్ మిల్లు తాలూకు కాంపౌండు గోడ.

2వ అయిటం : - విస్తీర్ణం **147** అంకణముల స్థలమునకు హద్దులు :- తూర్పు : దాల్‌మిల్లు, దక్షిణం : ఇతరుల సొంత ప్లాట్లు, పడమర : రోడ్డు, ఉత్తరం : శ్రీ చక్ర హైట్స్ అపార్ట్‌మెంటు.

కొండూరు శేషారెడ్డి, B.Com., B.L.,
అడ్వకేట్, బాలాజీనగర్, నెల్లూరు. సెల్ : 94402 77290